క్లుప్తంగా

యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



యోగా కార్యక్రమంలో పాల్గొన్న వార్డు సచివాలయ సిబ్బంది

ఏలూరు (టూటౌన్): నగరంలోని అన్ని వర్గాల ప్రజలు యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కార్పొరేషన్ కార్యాలయంలో యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయాల సిబ్బంది యోగాంధ్రా కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన పరిచి వారి పేర్లను యోగాంధ్ర యాప్ లో నమోదు చేయాలని ఇప్పటికే సూచించామన్నారు. ప్రజల్లో యోగా పై అవగాహన కలిగించేందుకు ఈ నెల 27న పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీపీఐ మహా సభలను జయప్రదం చేయాలి

చింతలపూడి: జూలై 5, 6, 7 తేదీల్లో చింతలపూడి పట్టణంలో నిర్వహించనున్న సీపీఐ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు స్థానిక పాత చింతలపూడి సీపీఐ శాఖ సమావేశం ఆదివారం బోడ వజ్రం అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, ముల్లగిరి నాగేశ్వరావు, సహాయ కార్యదర్శి దంతా కష్ణ, శాఖ సహాయ కార్యదర్శి తొర్లపాటి రాజు, శాఖ సభ్యులు ఎం.లాజరు, సరిపల్లి లెనిన్‌బాబు, గట్టు వెంకటేశ్వరరావు, ముల్ల గిరి ప్రసాద్, మర్సకట్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పోలవరం మండలం గడ్డపల్లికి చెందిన కెచ్చెల సీతారెడ్డి అమాయకుడు, సరిగా మాట్లాడలేడు. దీంతో సీతారెడ్డి వదిన కెచ్చెల నాగమణి ఈ నెల 24న దివ్యాంగుల సర్టిఫికెట్ కోసం ఏలూరు వెళ్లి అక్కడ పని చూసుకొని, తిరుగు ప్రయాణంలో జంగారెడ్డిగూడెం వచ్చారు. గడ్డపల్లి వెళ్లేందుకు బస్సు కోసం చూస్తుండగా, మధ్యాహ్నం 3 గంటల సమయంలో బాత్రూమ్‌కని సీతారెడ్డి వెళ్లి రాలేదన్నారు. దీంతో చుట్టు పక్కల, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవరుచుకోవాలని పెద్దలతో మర్యాదగా మెలుగుతూ తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలని రీసోర్స్‌పర్సన్ జీవీ ఆనంద రావు సూచించారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞానద శిక్షణ తరగతులు ఆదివారం విజ్ఞానదాయకంగా కొనసాగాయి. చిన్నారులు శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. ఉదయం ముందుగా చదవటం మాకిష్టంలో భాగంగా చిన్నారులతో నీతి కథలు చదివించి, వారి చేత కథలు చెప్పించారు. తొలుత రీసోర్స్‌పర్సన్ ఆనంద రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ లక్ష్యాన్ని చేరుకోవాలంటే తరచూ వార్తాపత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. సమయపాలన కూడా ఎంతో అవసరమని, చిన్నతనం నుంచే మంచి అలవాట్లు కలి గిఉండాలని, ఈ లక్షణాలు అన్నీ కలిగి ఉంటే భవిష్యత్తులో మీరు అనుకున్న లక్ష్యాన్ని చెరుకోగలరన్నారు. అనంతరం చిన్నారులతో ఫన్నీ గేమ్స్ ఆడించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఏ. నారాయణ రావు, బీ. రమేష్, ఎండీ. అస్లాంపాషా, విద్యార్థులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులతో నీతి కథలు చదివిస్తున్న రీసోర్స్‌పర్సన్



విద్యార్థులతో నీతి కథలు చెప్పిస్తున్న గ్రంథాలయాధికారి



చాటపర్రులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

మహిళా గ్రంథాలయంలో..

స్థానిక మహిళా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం బి.అనురాధ విద్యార్థులతో కథలు చదివించి వారితోనే కథల్లోని నీతిని చెప్పించారు. అనంతరం తెలుగు పదాలపై అంత్యాక్షరి, క్విజ్, గేమ్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జీవీ రమణ, కె.లక్ష్మీ దుర్గ, ఎం.జగదీశ్వరి, గ్రంథాలయాధికారి యాగంటి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చాటపర్రులో..

దెందులూరు: కథలు, పాఠాల్లో నీతిని ఆచరిస్తే ప్రతి విద్యార్థీ ఉజ్వల భవిష్యత్ పొందవచ్చని చాటపర్రు గ్రంథ పాలకురాలు వై.వాసుకి అన్నారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నీతి కథలు చెప్పించి పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తక పఠనంతో పాటు వినడం కూడా చాలా ముఖ్యమైన అంశం అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు శిక్షణ తరగతులు ముగిసిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారులతో ధ్రువీకరణ పత్రాలు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

నేడు రెండు మండలాల్లో చంద్రమౌళి పర్యటన

దెందులూరు : వైఎస్సార్‌సీపీ ఇంటిలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఊదరగొండ చంద్రమౌళి రెండు మండలాల్లో పర్యటిస్తారని నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. పెదవేగి మండలం రాయన్నపాలెంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొఠారు రామచంద్రరావు పరామర్శించి, అనంతరం ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలను కలుస్తారని పేర్కొన్నారు.

మజ్జిగ పంపిణీ

ఏలూరు రూరల్: సత్రంపాడు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్రంపాడులోని ఎన్టీఆర్ విగ్రహం ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. పాదచారులు, వాహచోదకులకు మజ్జిగ అందజేసారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్, గౌరవ అధ్యక్షులు కోటేశ్వరరావు, కార్యదర్శి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస రావు, వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం అందజేత

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛ భారత్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు, వంగాయగూడెం యాపిల్ కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ లో ఉన్న హెచ్ఐవి పిల్లలకు ఆదివారం పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైఎస్ కనకారావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఈ సంస్థలో ఉన్న పిల్లలకు పౌష్టికాహారం, ప్రోటీన్ ఫుడ్ అందిస్తున్నామని తెలిపారు. హెచ్ఐవీ బాధితులు మనోధైర్యంతో జీవించాలని, మంచి ఆహారం తీసుకుంటూ డాక్టర్ల సలహా మేరకు మందులు వాడటం ద్వారా జీవిత కాలాన్ని మరింత పెంచుకోవచ్చని అన్నారు. ఖర్జూరం, అటుకులు, బెల్లం, వేరుశెనగగుళ్ల, రాగి పిండి ఇతర పౌష్టికాహారం కలిగిన కిట్లను హెచ్ఐవీ బాధితులకు స్వచ్ఛభారత్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు మధ్యాహ్నం వెంకటేశ్వరరావు, కట్టా ఈశ్వర రావు, చిదరపోయిన శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులు కల్లూరు చంద్రశేఖర్, చేకూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్న స్వచ్ఛ భారత్ వాకర్స్ సభ్యులు

వైఎస్సార్‌సీపీ నేత లోక్‌నాథ్ రెడ్డి మృతి తీరని లోటు

ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు

లింగపాలెం: వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు ముల్లంగి లోకనాథ్ రెడ్డి మృతి వైఎస్సార్‌సీపీకి, వారి కుటుంబానికి తీరని లోటని ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ముడిచర్ల గ్రామంలో లోకనాథ రెడ్డి పెద్ద కర్మను పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కంభం విజయ రాజు, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు కేసరి సరితారెడ్డి, ఏలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ నేతలు లోకనాథ్ రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మట్ట సురేష్, తదితరులు పాల్గొన్నారు.



లోకనాథ్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దూలం నాగేశ్వరరావు

చికిత్స పొందుతూ వివాహిత మృతి

జంగారెడ్డిగూడెం: మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనికి సంబంధించి ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లికి చెందిన రమాదేవికి, వేగవరం గ్రామానికి చెందిన కప్పల మంగరాజుతో 8 నెలల క్రితం వివాహమైంది. మంగరాజు మందబుద్ధి ఉండడంతో తనకు తింగరివాడిని ఇచ్చి పెళ్లి చేశారంటూ రమాదేవి మానసికంగా బాధపడుతోంది. ఈ క్రమంలో 13న వేగవరంలోని ఇంటి వద్ద పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు, విజయవాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 24న మృతి చెందినట్లు ఆసుపత్రి నుంచి సమాచారం వచ్చింది. దీనిపై మృతురాలి తండ్రి గారపాటి మంగరాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



స్ఫూర్తి భవన్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తదితరులు

ఏలూరు (టూటౌన్) : గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ జూన్ 2న ఇళ్ల స్థలాల దరఖాస్తుదారులతో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆదివారం ఈ ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇప్పటికే ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం అనేకసార్లు దరఖాస్తులు చేసుకున్నారని, అయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందారని విమర్శించారు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న వాగ్దానాలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 2నఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారులతో నిర్వహించే ధర్నా కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసిన ఎన్నికల వాగ్దానాల మేరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని, ఉద్యోగాలు వచ్చేవరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి మూడు సిలిండర్లు పేరుతో ఇచ్చే సబ్సిడీ తొలి సిలిండర్ కు సంబంధించి నేటికీ చాలామందికి తమ ఖాతాలో సబ్సిడీ నగదు పడలేదని, ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు .రైతులకు అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని వాయిదాలతో కాలయాపన చేస్తున్నారని తక్షణం రైతులకు ఖాతాలలో నగదు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి ఎం.క్రాంతి,బేతా శంకర్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

‘తొలకరి’కి ముందే వర్షాలు

- సాధారణంగా జూన్ రెండో వారంలో రుతుపవనాలు
- ఈ సారి మే నెలాఖరులోనే ప్రవేశిస్తాయని వెల్లడించిన వాతావరణశాఖ
- ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి రోజూ పలు గ్రామాల్లో కురుస్తున్న వర్షాలు



బుట్టాయగూడెంలో కురుస్తున్న వర్షం

బుట్టాయగూడెం: ఆశల నైరుతి ముందస్తుగానే ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ తీపి కబురు చెబుతుంది. సాధారణంగా జూన్ రెండో వారంతో కేరళను తాకే రుతుపవనాలు ఈ సారి ముందస్తుగానే ఈ నెల 26వ తేదీనే రుతు పవనాలు తాకనున్నాయని వాతావరణ శాఖ ప్రకటించింది. అయితే రోహిణీ కార్తె ప్రారంభానికి ముందు నుంచే జిల్లాతో పాటు మన్యం ప్రాంతాన్ని వరుణుడు పలకరించాడు. మండు వేసవిలో నిండుగా కమ్ముకొచ్చిన కారు మబ్బులతో గిరిజన ప్రాతంలో విస్తారంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గత వారం రోజుల నుంచి ఉదయం, సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నాయి. సాధారణంగా జూన్ రెండో వారం దాటిన తర్వాత తొలకరి జల్లులు పలకరిస్తాయి. అయితే అకాల వర్షాలు, తుఫాన్లతో మరింత ముందుగా వానలు కురుస్తుండడంతో తొలకరి ముందుగానే వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది వచ్చే వానాకాలం ఖరీఫ్ సీజన్‌పై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముందుగా కురుస్తున్న వానలతో పలు చోట్ల రైతులు దుక్కులను కూడా సిద్ధం చేసుకున్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూమి మరింత నానిందని రైతులు అంటున్నారు.

విచిత్ర వాతావరణం

రోహిణీ కార్తెలో ఎండలు రోళ్లే పగులుతాయని నానుడి. సూర్య భగవానుడు రోహిణి నక్షత్రంలో ఉన్న సమయంలో రోజు రోజుకూ వేడి పెరుగుతుంది. ఆ సమయంలో తీవ్రమైన ఎండలు కాస్తాయి. అయితే ఈ ఏడాది రోహిణి కార్తె ప్రారంభమైనా అకాల వర్షం కారణంగా వాతావరణం చల్లగానే ఉంది. 8 రోజులు ముందుగానే రుతు పవనాలు కేరళను తాకడంతో ఎండల తీవ్రత ఉండే పరిస్థితి లేనట్లే కనిపిస్తుంది. మరో రెండు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి రుతు పవనాలు ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ఎండల ప్రభావం ఉండకపోవచ్చని పలువురు భావిస్తున్నారు. ప్రస్తుతం అకాల వర్షాలతో వాతావరణం చల్లబడడంతో తీవ్రమైన ఉక్కబోత సమస్య నుంచి అందరూ ఉపశమనం పొందుతున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	20
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	06
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	10
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	10
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	01
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	03
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	08
ఏలూరు - తిరుపతి	16.00	4830	26

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	30	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	50
బెండకాయలు	26	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	40	బీట్‌రూట్	36
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	22	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	12
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	40

పెద్దింట్లమ్మ, ముసలమ్మతల్లి ఆలయంలో పూజలు

దెందులూరు: కొవ్వలి గ్రామంలో ఉత్తర దిక్కు న పొలిమేరలో వేంచేసిన శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారు, శ్రీ కుంటల ముసలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అమ్మవార్లకు భక్తులు పూజ లు ప్రదక్షిణలు నిర్వహించారు. అమ్మవారికి నైవేధ్యాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త ఆలపాటి రామకృష్ణ దంపతులు, గొల్లపూడి వెంకటేశ్వరరావు గొల్లపూడి మధు, నిరసి వెంకటరమణ భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

దోసపాడు కోర్ జిల్లాకు ఆదర్శం కావాలి

దెందులూరు: దోసపాడు సాల్వేషన్ ఆర్మీ ఆధ్యాత్మికంగా జిల్లాకు ఆదర్శం కావాలని సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ కమాండర్ మేజర్ ఏసు రాజులత అన్నారు. ఏలూరు డివిజనల్ కమాండర్‌గా నియమితులై తొలిసారిగా దోసపాడు కోర్టు విచ్చేసిన డివిజనల్ కమాండర్ దంపతులకు గ్రామంలో అపూర్వ స్వాగతం లభించింది. స్థానిక కోర్ ఆఫీసర్ జోసఫ్ కటాక్షం సంఘ పెద్దలు సంఘస్తులు గృహ సమితి సభ్యులు, యువత, చిన్నారులు ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ నుంచి వివిధ రకాల పుష్పాలతో వారిపై చల్లుతూ చర్చి వరకు మేళ తాళాలు క్రైస్తవ గీతాలాపనలతో తీసుకొని వెళ్లారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డివిజనల్ కమాండర్ దంపతులకు ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో కల్యాణ్ రావు, వెంకట్రావు ఆదాము రాజేష్, జ్ఞాన సుందరం పద్మరాజు కుమార్ ఉన్నారు.

సహజ వనరులను దోచేందుకే ఆపరేషన్ కగార్



మావోయిస్టులతో చర్చించాలని నినాదాలు చేస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు

కుక్కునూరు: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కర్రెగుట్టల్లో ఉన్న సహజ వనరులను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ పెట్టుబడిదారీ సంస్థలకు కట్టబెట్టేందుకే ఆపరేషన్ కగార్ చేపట్టినట్టు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాలరావు ఆరోపించారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మండల ముఖ్య కార్యకర్తల సమావేశం జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి సోయం చంద్రావు అధ్యక్షతన ఆదివారం మారేడుబాక గ్రామంలో నిర్వహించారు. సమావేశంలో జిల్లా నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, రక్షణ శాఖ మంత్రి అమిత్‌షా తీసుకొచ్చిన ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీ గిరిజన ప్రజలు 500 మంది మృతి చెందారని, 100 మంది వరకు మావోయిస్టులు మృతి చెందారన్నారు. ఒరిస్సాలో అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న నంబాల కేశవరావును పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపించారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కట్టం వీరాస్వామి, పోలవరం డివిజన్ కార్యదర్శి కట్టా ముత్యాలరావు, కుక్కునూరు మండల కార్యదర్శి కంగాల కల్లయ్య, జంగారెడ్డిగూడెం కార్యదర్శి పెరుమాళ్ల శ్రీను, మిరియాల సుజాత, కవులూరి సీత, మడివి మహేష్, గొప్ప ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

భీమడోలు: సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఇన్‌పేషెంట్లకు రుచి, శుచితో ఉన్న ఆహారాన్ని అందజేస్తున్నామని భీమడోలు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఇన్‌పెషెంట్లకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందజేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోగులకు ఉచితంగా పౌష్టిక విలువ గల ఆహారాన్ని అందించారు. భీమడోలు ఏఎంసీ చైర్మన్ శేషపుగిరి, మాజీ ఏఎంసీ చైర్మన్ దూసనపూడి పుల్లయ్యలు రోగులకు భోజనం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి నిధుల్లో నుంచి రోగులకు ఉచితంగా భోజనం అందిస్తున్నామని, ఆసుపత్రి వచ్చే రోగులకు ఆహారాన్ని బయట నుంచి తీసుకుని వచ్చేందుకు వారి బంధువులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రమైన రుచితో ఉన్న ఆహారం అందించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి రోజూ రోగులకు భోజనాన్ని అందిస్తామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, యర్రంశెట్టి వాసుబు, పెద్దలు గణ, పైడిమాల యుగంధర్, కుక్కల ప్రసాద్, తాటిమళ్ల రామ్మూర్తి పాల్గొన్నారు.

దెందులూరు ఇన్‌చార్జి ఎంఈఓగా నరసింహమూర్తి

దెందులూరు: దెందులూరు మండల ఇన్‌చార్జి ఎంఈఓగా సబ్బిత నరసింహమూర్తిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దెందులూరు ఎంఈఓ 1గా ఉన్న ఏవీఎస్‌వీ ప్రసాద్ మెడికల్ లీవ్‌లో ఉండడంతో గతంలో చింతలపూడి ఎంఈఓను ఇన్‌చార్జి ఎంఈఓగా నియమించారు. ఆయన విధుల్లో చేరకపోవడంతో పెదపాడు ఎంఈఓగా పని చేస్తున్న నరసింహమూర్తికి దెందులూరు మండల ఇన్‌చార్జి ఎంఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.